

# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక







సంపుటి: 3 సంచిక: 283 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు గురువారం, 06 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 283 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR THURSDAY, 06 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


## మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

- రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ
- ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి
- ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు
- ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన
- దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ




2లో.

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్..

- విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం
- ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు
- మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి
- ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

**అమరావతి, ఆగస్టు 05:** సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు**మిగతా 2లో...**



# డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

- ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటు
- విశాఖలో సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్




**విశాఖపట్నం ఆగస్టు 05:**
: ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోందన్నారు.**మిగతా 2లో...**

## సీమ అవసరాలకు శ్రీశైలం నీరు

- 2027 జూన్ వరకు భద్రపరచుకోవాల్సిందే
- నీటిని విడుదల చేసినట్లు వెల్లడించిన మంత్రి నిమ్మల



**అమరావతి, ఆగస్టు 05:**
రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలని అన్నారు. నేటికి శ్రీశైలం వద్ద ఉన్న 119 టీఎంసీలకు తోడు, రాబోయే 10 రోజులలో మరొక 100 టీఎంసీల వరకు ఇన్ ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో ఏపీ 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని ఎల్‌నినో దృష్ట్యా ప్రథమ **మిగతా 2లో...**

## విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

- ఇది బహుళ క్రీడా కేంద్రం, సీఎం చంద్రబాబు సూచనతోనే రూపకల్పన
- సంస్థలే ఛాంపియన్లను నిర్మిస్తాయని, క్రీడలు వ్యక్తిత్వాన్ని పెంచుతాయని వ్యాఖ్య
- ఏపీని క్రీడాకారులను తయారు చేసే గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యం
- ప్రతి బిడ్డలో స్ఫూర్తి నింపిన సింధుకు లోకేశ్ అభినందనలు

2లో.




# రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

## : కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్

**అమరావతి, ఆగస్టు 05:**
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని **మిగతా 2లో...**



## న్యాయవాదుల రక్షణ బిల్లు ముసాయిదా రూపకల్పనకు గ్రీన్ సిగ్నల్

- న్యాయ కార్యదర్శిని ఆదేశించిన న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్
- న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం- మంత్రి ఫరూక్ స్పష్టీకరణ



2లో.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..



- తుమ్మిడిహట్టి పెంపునకు ఒత్తిడి తెండి
- మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి
- అటవీ పర్యావరణ అనుమతలుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ
- ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి
- బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

**న్యూఢిల్లీ,ఆగస్టు 05:**
తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

## రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

- జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు
- దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం
- సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

**ముంబై, ఆగస్టు 05:**
జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు**మిగతా 2లో...**



## అమెరికాలో భారతీయుల ఘనత..

- 'ఇండియా డేగా ప్రకటిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ ఉత్తర్వులు!
- ప్రవాస భారతీయుల సేవలకు గుర్తింపుగా గవర్నర్ మౌరా హీలీ ప్రకటన
- బోస్టన్ నగరంలోనూ 'ఇండియా డేగా పాటిస్తూ మేయర్ ఉత్తర్వులు
- భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత సంఘాల సన్నాహాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 05:**
అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం **మిగతా 2లో...**



# సీమ అవసరాలకు శ్రీశైలం నీరు

మొదటి పేజీ తరువాయి

ప్రాధాన్యంగా తాగునీటికి విడుదల చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల కోసం 13 టీఎంసీలు అవసరమని మంత్రి వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి కోసం10 టీఎంసీలను రేపటి నుంచి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటికై 10 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉందన్నారు. నాగార్జున సాగర్, రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ పరిధి తాగునీటికి 32 టీఎంసీలు అవసరమన్నారు. వారం, వారం సమీక్ష చేసుకుని ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే విధంగా వర్షాలు, వరదల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ నీటి భద్రతకు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

# రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

మొదటి పేజీ తరువాయి

ఆయన ఆరోపించారు.పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.
గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

# అమెరికాలో భారతీయుల ఘనత..

మొదటి పేజీ తరువాయి

పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్-అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తుచేశారు.మరోవైపు, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు.గవర్నర్, మేయర్ల నిర్ణయంపై 'ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్' (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# న్యాయవాదుల రక్షణ బిల్లు ముసాయిదా రూపకల్పనకు గ్రీన్ సిగ్నల్

**న్యాయ కార్యదర్శిని ఆదేశించిన న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం- మంత్రి ఫరూక్ స్పష్టీకరణ**



**అమరావతి, ఆగస్టు 05:** ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు-2026( ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్ -2026)ను రూపొందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ చర్యలకు ఉపక్రమించింది.
ముసాయిదాను వీలైనంత త్వరగా తయారు చేయాలని న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవికి న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగం తో యుద్ధ ప్రాతిపదికన చర్చించి ముసాయిదా రూపకల్పనకు కార్యాచరణ చేపట్టాలని న్యాయశాఖ కార్యదర్శి కి సూచన చేసినట్లు మంత్రి ఫరూక్ బుధవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.
ముసాయిదా బిల్లు తయారైన వెంటనే తదుపరి చర్యల కోసం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తో పాటు ఆర్థిక శాఖ రిమార్కులను పరిగణలోకి తీసుకొని బిల్లు ఆమోదం కోసం మంత్రి మండలి సమావేశం ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని మంత్రి తెలిపారు.న్యాయవాదు ల సంక్షేమానికి, రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు ప్రకారం మొత్తం రూ. 46.92 కోట్లు ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

# రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు


మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

## డయల్ 112తో అన్ని సేవలు

**హైదరాబాద్, ఆగస్టు 05:**




తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

మొదటి పేజీ తరువాయి

150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్ఎస్పీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

# డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

మొదటి పేజీ తరువాయి

సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎ÷-లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

**అమరావతి,ఆగస్టు 05:**

ఒలింపిక్ పతకాలను అథ్లెట్లు గెలుస్తారని, కానీ ఆ ఒలింపిక్ కలలను సాకారం చేసేది అకాడమీలేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పీవీ సింధు అకాడమీ అలాంటి ఛాంపియన్లను తయారుచేసే గొప్ప సంస్థగా ఎదుగుతుందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం విశాఖపట్నంలో 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అకాడమీ కేవలం ఒక భవనం కాదని, భావి భారత ఛాంపియన్లకు పునాది అని ఆయన అభివర్ణించారు.ఈ అకాడమీ ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిదాయక నేపథ్యాన్ని లోకేశ్ వివరించారు. "పీవీ సింధు తన హృదయానికి దగ్గరైన ఒక కలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఒక బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మించాలనే తన ఆశయాన్ని పంచుకున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి ఎప్పుడూ ఉన్నదాని కంటే గొప్పగా ఆలోచించమని సవాల్ విసురుతారు. ఆయన సింధుతో 'కేవలం బ్యాడ్మింటనే ఎందుకు? అంతకు మించి ఆలోచించు. వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పిల్లలందరికీ శిక్షణ ఇచ్చే ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మించు' అని ప్రోత్సహించారు. ఈ రోజు మనం చూస్తున్న ఈ బృహత్ కార్యం ఆ దార్శనికతకు ప్రతిరూపం" అని లోకేశ్ తెలిపారు. ఇది కేవలం ఒక సౌకర్యం నిర్మించడం కాదని, ఒక వారసత్వాన్ని నిర్మించడం అని ఆయన అన్నారు.
ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, చదువుతో పాటు క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. "తరగతి గది జ్ఞానాన్ని నిర్మిస్తే, క్రీడా మైదానం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. అందుకే రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారాలను 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. విద్యార్థులకు నచ్చిన క్రీడను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చి, వారికి అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తున్నాం" అని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, గౌరవం, ఓటమిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పుతాయని, అందుకే ప్రతి బిడ్డ ఒక క్రీడ ఆడాలని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్‌లో సైబర్ సిటీ నిర్మిస్తున్నప్పుడు చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారని, కంప్యూటర్లు కడుపు నింపుతాయా అని ప్రశ్నించారని లోకేశ్ గుర్తుచేశారు. "కానీ ఆ ఒక్క భవనం హైదరాబాద్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికింది. అదేవిధంగా, ఈ అకాడమీ కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ దత్తాత్రేయకు 18 నెలల గడువు విధిస్తూ, 2028 మే నాటికి రిబ్బన్ కటింగ్ ఉండాలని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌ను కేవలం గొప్ప విద్యార్థులు, పరిశ్రమలకే కాకుండా, గొప్ప క్రీడాకారులను తయారుచేసే గమ్యస్థానంగా మార్చడమే తమ కల అని లోకేశ్ అన్నారు. "ఈ అకాడమీ గేట్ల నుంచి ఒకనాడు ఆశతో అడుగుపెట్టిన చిన్నారి, కొన్నేళ్ల తర్వాత ఒలింపిక్ స్టేడియంలో మన మువ్వన్నెల జెండాను మోస్తుంది. ఆ ప్రయాణం ఇక్కడే ప్రారంభమైందని మనమందరం గుర్తుంచుకుంటాం. 'సింధు చేయగలిగితే, నేను కూడా చేయగలను' అని ప్రతి బిడ్డ నమ్మాలి" అని పిలుపునిచ్చారు. విశాఖను ఎంచుకున్నందుకు సింధుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

# విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్..

మొదటి పేజీ తరువాయి

. ఈసందర్భంగా అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రూ.3.50 నుంచి రూ.4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బీసీటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖపట్నం రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా విశాఖపట్నం రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సీఎం సూచించారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించేలా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు. రూ. 3.50-4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు.. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ. బీసీటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖ రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వ ఆలోచన. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని.. ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ ఉండాలన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలన్నారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని స్పష్టం చేశారు. నిధుల కన్వర్జ÷న్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలన్నారు.

# మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

**రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ**

**ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి**

**ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు**

**ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన**

**దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 05:**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం తర్వాత రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాణిజ్య అనిశ్చితి దృష్ట్యా తటస్థ వైఖరినే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది.
రెపో రేటులో మార్పు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న హోమ్ లోన్, వాహన రుణం, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు వెంటనే పెరగవు. కొత్త రుణాలపై కూడా బ్యాంకులు ప్రస్తుత వడ్డీ రేట్లనే కొనసాగించే అవకాశం ఉంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. అమెరికా కొత్త సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతోందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావంతో ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్లు ఇంకా ఒడుదొడుకులకు లోనవుతున్నాయని చెప్పారు.
స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతంగానే కొనసాగించారు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును 5.5 శాతంగా యథాతథంగా ఉంచారు.
ద్రవ్యోల్బణం ఇటీవల కొంత పెరిగినా ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితుల్లోనే ఉందని గవర్నర్ తెలిపారు. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి మారకపు విలువలో మార్పులు, పశ్చిమాసియా పరిణామాలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా పేర్కొన్నారు.
మరోవైపు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. వృద్ధి రేటులో ఊపు కొనసాగడం, సానుకూల వర్షపాతం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని వెల్లడించింది.
అయితే కొన్ని రంగాల్లో ప్రారంభ దశ ఒత్తిడి కనిపిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి అంచనాల చుట్టూ ఇంకా గణనీయమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని వ్యాఖ్యానించారు.
జూన్‌లో జరిగిన గత ఎంపీసీ సమావేశంలో కూడా రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించారు. అదే సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల ఇందుకు కారణాలని అప్పట్లో పేర్కొంది.

భారత్
# ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు వార్తలు
గురువారం, 06 ఆగష్టు 2026

# ఉత్తమ అధికారులుగా చిరస్మరణీయ సేవలు అందించండి




### యువ అధికారులకు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ సూచన

**గుంటూరు, 05 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఉత్తమ అధికారులుగా చిరస్మరణీయ సేవలు అందించాలని గ్రూప్ వన్ యువ అధికారులకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఉద్బోధించారు. సమస్య పరిష్కార వైఖరి కలిగి ఉండాలని సూచించారు. 2026 గ్రూప్ వన్ బ్యాచ్ లో ఎంపికైన అభ్యర్థుల క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంచి వైఖరి కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. విశాల దృక్పథం కలిగి ఉండాలని, ఫలితాలు సాధించగలిగే యుక్తి ఉండాలని పేర్కొన్నారు. ఒక పనిలో తుది లక్ష్యం పక్కాగా సాధించగలిగే విధంగా ఉండగలిగాలని చెప్పారు. "మీస్థానానికి న్యాయం చేయాలని" సూచించారు. వృత్తి ధర్మం పాటించాలని అన్నారు. పనిలో ఆనందం పొందాలని సంతృప్తి సాధించాలని చెప్పారు. నిత్యం చేసే పని కంటే విభిన్నంగా, వినూత్నంగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కార దిశలో దాని మూలాలను శోధించి దానికి దీర్ఘకాలిక పరిష్కారం అందించగలగాలని అన్నారు. ప్రభుత్వానికి మంచి సంపదగా మీరు ఉండాలని అన్నారు. మంచి పని చేస్తూ, నిబద్ధతతో ఉంటే ప్రజల మనసులలో చిరస్మరణీయంగా ఉంటారని, గౌరవం పొందుతారని తెలిపారు. ఉద్యోగ ధర్మం నిర్వహణలో ఆదర్శవంతమైన నాయకునిగా ఉండాలన్నారు. వ్యవస్థలో నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారిగా వివిధ ప్రాంతాల్లో పర్యటించడం, గిరిజన విద్యార్థులకు సూపర్ 60 బ్యాచ్ నిర్వహించి ఐఐటి, ఎన్.ఐ.టి వంటి సంస్థలలో గిరిజన విద్యార్థులు చేరడం వంటి అంశాలు సంతృప్తి కలిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి అనుసంధానం వంటి సమస్యలు, ప్రసవాలు వంటి అంశాలను సమన్వయం చేయడం ప్రధానం అన్నారు. నెలకు ఎనిమిది, తొమ్మిది మాతృ మరణాలు ఉండగా "మాతృ దేవో భవ" కార్యక్రమాన్ని నిర్వహించి ఒకటికి తీసుకువచ్చామని తన అనుభవాలను పంచుకున్నారు. "అద్భుతమైన పనితీరు చూపండి ఉద్యోగములో సంతృప్తి పొందండి" అన్నారు. ఏ సమయంలో నైనా నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, ఉద్యోగ నిర్వహణ ఉత్తమంగా చేయడం గొప్ప కళ అన్నారు. ఉద్యోగ బాధ్యతలను కుటుంబ మరియు ఇతర వ్యక్తిగత అంశాలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తద్వారా వృత్తి నిర్వహణలో బాగా పనిచేయుటకు అవకాశం ఉంటుందని అన్నారు. ఇందుకు యోగా వంటి ప్రక్రియలను అవలంభించాలని సూచించారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విభిన్న విభాగాలలో పనిచేయడం జరుగుతోందని, అందులో మంచి అనుభవం పొందాలని అన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ, వివిధ శాఖల మధ్య సమన్వయం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల సంస్థ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరల అభ్యున్నతికి ఎన్డీయే ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయాలు

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 05 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న "ఇంటింటికి కూటమి ప్రభుత్వం -సంక్షేమ విజయాలు" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్ వడ్డెగూడెంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం వడ్డెర సామాజిక వర్గ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు వడ్డెరలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. వడ్డెర సహకార సంఘాల ఆర్థికాభివృద్ధికి మైనర్ ఖనిజ క్వారీల కేటాయింపుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించామని, కొత్తగా ఏర్పడిన వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయించే ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వడ్డెర కార్మికులు, సహకార సంఘాలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మైనింగ్ సీనరేజ్ ఫీజు, ప్రీమియంపై 50 శాతం భారీ రాయితీ కల్పించడం ద్వారా వారికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు వీర వడ్డె ఓబన్న సేవలను గుర్తిస్తూ ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసి, దాని ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు, రుణ సదుపాయాలు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల ద్వారా కూడా వడ్డెర కుటుంబాలు పెద్దఎత్తున లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం 2.0 కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు సామాన్య కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా ఎన్డీయే ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ప్రజలు మరోసారి ఈ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# రాష్ట్రానికి జగన్ వైరస్ లా మారాడు : ఎమ్మెల్యే నసీర్




**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రానికి జగన్ వైరస్ లా మారారని, యువత భవితను నాశనం చేసేందుకు డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ మండిపడ్డారు. రెండేళ్ల పాలనపై నమ్మకం-అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా బుధవారం స్థానిక 50వ వార్డులోని శారదా కాలనీ మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ప్రజలతో మమేకమవుతూ కూటమి ప్రభుత్వం అండగా ఉందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతను తప్పుదోవ పట్టించేందుకు, వారి జీవితాలతో ఆడుకునేందుకు జగన్ మాఫియా కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. డీఎస్సీపై సీబీఐ దర్యాపు కోరుతూ హైకోర్టును వైసీపీ ఆశ్రయించడం దారుణమన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారని కోర్టు చెప్పడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ద్వారా యువత నష్టపోతే వారు కోర్టుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బాధితులే ముందుకు రానప్పుడు ప్రజాహితానికి ఎక్కడ ఆస్కారం ఉందని కోర్టు ప్రశ్నించడం వైసీపీ కుట్రలకు తార్కాణమని చెప్పారు. ఇలాంటి దుష్ట రాజకీయాలు చేస్తోన్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమేయాలని పిలుపునిచ్చారు. ఒక వైపు కిడ్నాపర్లు, మరో వైపు రౌడీ బ్యాచ్ రాష్ట్రంలో అభివృద్ధికి ఆటంకంగా మారారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్ల కాలంలోనే కనీవినీ ఎరు గని అభి వృద్ధి చేశారని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజక వర్గంలో అన్ని ప్రాంతాలను ప్రగతిపథంలోకి సుకెళుతున్నామన్నారు. నియోజకర్గ ప్రజలకు ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని చెప్పారు. శారదా కాలనీలో గతంలో ఎలాంటి సౌకర్యాలు లేవని తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్ల ఆవశ్యకతను గుర్తించి నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దిరాల మ్యాని, మహంకాళి నరసింహారావు, పఠాన్ బాజి, కేసాని ప్రసాద్, కోట గోపాల్, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, మోహన్ కృష్ణ, వంగర ఏడుకొండలు పాల్గొన్నారు.

# ప్రాణాంతక వ్యాధులపై సమర శంఖం.. తొలిదశలో గుర్తిస్తేనే సంపూర్ణ నివారణ

### యశోద హాస్పిటల్స్ వైద్యుల వెల్లడి




**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మారుతున్న ఆధునిక జీవనశైలి, తీవ్రమవుతున్న వాతావరణ కాలుష్యం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మానవ మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతూ ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తున్నాయని, ముఖ్యంగా ఊపిరితిత్తులు, ఛాతీ, కాలేయం, జీర్ణాశయం తదితర కీలక అవయవాల పనితీరు దెబ్బతిని ఎంతోమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని యశోదా హాస్పిటల్స్ వైద్యులు వెల్లడించారు. గుంటూరు నగరం బ్రాడీపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోదా హాస్పిటల్స్ వైద్యులు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే పసిగట్టి కచ్చితమైన వైద్యం అందిస్తే సంపూర్ణ ఆరోగ్యం తథ్యమని వైద్య రంగంలో తమకంటూ సువర్ణాక్షరాలతో లిఖించుకునే స్థాయికి ఎదిగిన ప్రఖ్యాత యశోద హాస్పిటల్స్ వైద్య దిగ్గజాలు స్పష్టం చేశారు. గుంటూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో మలక్‌పేట్ విభాగానికి చెందిన థొరాసిక్ సర్జన్ డాక్టర్ రామ్ ఫణీంద్ర, సికింద్రాబాద్ విభాగానికి చెందిన మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అనిల్ కుమార్ మన్నవ పాల్గొని ప్రజల ఆరోగ్య పరిరక్షణపై కీలక విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ ఫణీంద్ర మాట్లాడుతూ ఛాతీకి సంబంధించిన రుగ్మతలు అత్యంత నిశ్శబ్దంగా దేహంలో విస్తరిస్తాయని, సాధారణ జలుబు, దగ్గుగా భావించి నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దీర్ఘకాలిక దగ్గు, కఫంలో రక్తం పడటం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది,అకారణంగా బరువు తగ్గడం వంటివి ఊపిరితిత్తుల క్యాన్సర్, ఇతర ఛాతీ ఇన్‌ఫెక్షన్లకు సంకేతాలుగా భావించాలని, ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం, కాలుష్యం కోరల్లో చిక్కుకున్న వారు ఈ వ్యాధుల బారినపడే ప్రమాదం అధికంగా ఉంటుందని అన్నారు. యశోదఆసుపత్రిలో అందుబాటులోఉన్న అత్యాధునిక వీడియో అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ (VATS), రోబోటిక్ సర్జరీల ద్వారా అతి చిన్న కోతలతోనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు సునాయాసంగా చేస్తున్నామని, దీనివల్ల రోగులు అతి తక్కువ సమయంలోనే కోలుకుని సాధారణ జీవితం గడిపే అవకాశం ఉంటుందని వివరించారు.డాక్టర్ అనిల్ కుమార్ మన్నవ మాట్లాడుతూ కడుపులో మంట, అజీర్ణం వంటి చిన్నపాటి సమస్యలే పెద్ద జీర్ణాశయ వ్యాధులకు మూలకారణమని అన్నారు.నేటి యువత, పెద్దలలో సైతం ఒత్తిడి, స్థూలకాయం, మధుమేహం కారణంగా గ్యాస్ట్రిక్, మలబద్ధకం, విరేచనాలు వంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయని తెలిపారు.ఫ్యాటీ లివర్ సమస్యను నిర్లక్ష్యం చేస్తే అది కాలేయ వాపు, సిరోసిస్, చివరకు కాలేయం పూర్తిగా చెడిపోయే ప్రమాదానికి దారితీస్తుందని,ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్, ఈఆర్‌సీపీ లాంటి ఆధునిక వైద్య పరిజ్ఞానంతో యశోద ఆసుపత్రిలో జీర్ణకోశ, ప్యాంక్రియాస్ వ్యాధులకు సత్వర, కచ్చితమైన పరిష్కారాలు చూపుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ విభాగాధిపతి వీరంకి వెంకటేశ్వరరావు, గుంటూరు ప్రాంతీయ అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ తిమోతి, హాస్పిటల్ బృందం పాల్గొన్నారు.




## ధృతి బి2 ఎక్స్‌పో - 2026కు సర్వం సిద్ధం

**గుంటూరు, 05 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో ఈ నెల 07,08,09 తేదీలలో నిర్వహించనున్న బి2 ఎక్స్‌పో-2026కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ మహా వ్యాపార ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 140 స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. బి2 ఎక్స్‌పో అధ్యక్షులు కె. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "గృహోపకరణాలు, ఫర్నిచర్, సోలార్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, విద్యా సంస్థలు, సహజ ఉత్పత్తులు, హెల్త్‌కేర్, ఆటోమొబైల్స్, లైఫ్ స్టైల్, ఫైనాన్స్, టెక్నాలజీ తదితర అనేక విభాగాలకు చెందిన మొత్తం 140 స్టాల్స్ ఒకే వేదికపై ఏర్పాటు చేయడం విశేష మన్నారు. వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, వినియోగదారులకు ఇది అత్యుత్తమ అవకాశంగా నిలుస్తుందన్నారు. బి2ఎక్స్‌పో కార్యదర్శి బి.హేమంత్ మాట్లాడుతూ, ఎక్స్‌పోలో భాగంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ కాన్సర్) స్క్రీనింగ్, రొమ్ము క్యాన్సర్ (బ్రెస్ట్ కాన్సర్) స్క్రీనింగ్, అలాగే వివిధ రకాల ఉచిత రక్త పరీక్షలు మరియు ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యక్షులు మాట్లాడుతూ, ప్రారంభంలో 70 స్టాల్స్‌తో ప్రణాళిక ప్రారంభమైనప్పటికీ, వ్యాపారవేత్తల విశేష స్పందనతో అది 140 స్టాల్స్కు చేరుకుందని తెలిపారు. ఎక్స్‌పోకు ప్రవేశం పూర్తిగా ఉచితం అని, వ్యాపార విస్తరణ (బిజినెస్ ఎక్స్పన్షన్), బ్రాండ్ ప్రమోషన్, మార్కెటింగ్, కొత్త వ్యాపార అవకాశాలు మరియు వినియోగదారులతో ప్రత్యక్ష అనుసంధానానికి ఈ ఎక్స్‌పో ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, యువత, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహా వ్యాపార ప్రదర్శనను విజయవంతం చేయాలని బి2 ఎక్స్‌పో కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ధృతి బి2 ఎక్స్‌పో కో-కన్వీనర్లు బద్రి, రమణమూర్తి, నిర్వాహక కమిటీ సభ్యులు చైతన్య, వంశీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో లిక్విడ్ గంజాయి విక్రయం



**గుంటూరు, 05 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పాతగుంటూరులో లిక్విడ్ గంజాయి, టాపెంటడాల్ టాబ్లెట్లు విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 120 గ్రాముల లిక్విడ్ గంజాయి, 50 టాపెంటడాల్ టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో నిందితులను పట్టుకుని, ఎన్డీపీఎస్ చట్టం, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ సీతారాం తెలియజేశారు.

## ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అవయవ దానం పై అవగాహన కార్యక్రమం






**గుంటూరు, 05 ఆగస్టు2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అవయవ దానం పై అవగాహన కార్యక్రమం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ ఫర్ ఉమెన్, గుజ్జనగుళ్ల లో నిర్వహించడం జరిగింది. నేత్రదానం మరణించిన తరువాత కార్నియా డొనేషన్ వల్ల మరో ఇద్దరి అందులకు జీవితంలో వెలుగులు నింపడం దృష్టి దానం కలిగించడం, బ్రతికి ఉండగా రక్తదానం కిడ్నీ దానం లిటిల్ బిట్ ఆఫ్ లివర్ ద్వారా కూడా అవయవ దాన అవసరాలు తీర్చడం, బ్రెయిన్ డెడ్ సమయంలో ఎనిమిది మందికి పునర్జీవులను కలిగించవచ్చు, అని అధ్యక్షురాలు రాధా రాణి విద్యార్థులకు వివరించారు. ప్రజలలో ఎన్నో అపోహలు ఉన్నాయని వాటిపై విద్యార్థి దశ నుండి అపోహలు తొలగించి అవగాహన పెంచుకుని ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మరణించినా జీవించడం ఒక్క అవయవ దానం ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది అని జిల్లా గౌరవ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ విద్యార్థులకు వివరించారు అనంతరం అందరి చేత అవయవ దాన ప్రతిజ్ఞ జిల్లా అధ్యక్షురాలు రాధా రాణి చేపించారు కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు అప్రిసియేషన్ సర్టిఫికెట్స్, బుక్స్, పెన్స్ ప్రధానం చేయడం జరిగింది.

## ఇన్నర్ రింగ్ రోడ్ ఫేస్ 3 పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### జీఎంసి కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, 05 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాళిక, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ అధికారులతో ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇన్నర్ రింగ్ రోడ్ నగర ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు భవిష్యత్ రవాణా అవసరాలకు కీలకమైన మౌలిక సదుపాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు. రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న పెండింగ్‌లోని 16 విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాల తొలగింపు, విద్యుత్ లైన్ల మార్పిడి పనులను వేగవంతం చేసి రోడ్డు నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఎస్‌పీ కాలువ వెడల్పు పెంపునకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను ప్రారంభించాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. అదేవిదంగా వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఎత్తు పెంచే పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్ విస్తరణకు ప్రభావితమైన స్థలాలకు సంబంధించి జీఎంసీ నుంచి పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించాల్సిన పెండింగ్‌లో ఉన్న మూడు స్థలాల బదిలీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ, స్థలాల అప్పగింత, యుటిలిటీల మార్పిడి వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. పనుల నాణ్యతతో పాటు భద్రతా ప్రమాణాలను కూడా కచ్చితంగా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు.

## నో మ్యాపింగ్.. అసాధారణతల పై ప్రత్యేక దృష్టి

### 1,775 మంది ఓటర్ల గుర్తింపునకు వేగవంతమైన చర్యలు
### ఈసీ మార్గదర్శకాల మేరకు నోటీసులు జారీ చేసి అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చాలి : నగర ఎన్నికల అధికారి కేటీ సుధాకర్




**కాకినాడ బ్యూరో, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ అసాధారణతలు కింద నమోదైన 1,775 మంది ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించి, అర్హులైన ఒక్క ఓటరూ జాబితా నుంచి దూరం కాకుండా చర్యలు చేపట్టాలని కాకినాడ నగర ఎన్నికల అధికారి, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ నోటీసుల పంపిణీ, విచారణ, అర్హులైన వారి పేర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నో మ్యాపింగ్' మరియు 'అసాధారణతలు' కింద నమోదైన 1,775 మంది ఓటర్లకు ప్రత్యేకంగా నోటీసులు జనరేట్ చేసి, వాటిని సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేసి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్‌లు తీసుకోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల ధ్రువీకరణ పత్రాల్లో తగిన పత్రాలను జతచేసి మళ్లీ దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, అర్హత నిర్ధారణ అనంతరం అర్హులైన వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని, అర్హత లేని వారి విషయంలో కారణాలు స్పష్టంగా పేర్కొంటూ 'స్పీకింగ్ ఆర్డర్స్' జారీ చేయాలని ఆదేశించారు. అసాధారణతలు అంటే పేరు స్పెల్లింగ్‌లో పొరపాట్లు, ఇంటి పేరు మార్పులు, తల్లిదండ్రుల పేర్లలో తేడాలు, వయస్సుకు సంబంధించిన తప్పులు తదితర వివరాల్లో ఉన్న వ్యత్యాసాలని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌వోలు కే.శ్రీనివాస్, గోవింద రాజులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

# వ్యర్థాల నుంచి సంపద సృష్టి

### జిల్లాలో 4 బయోగ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటు
### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్





**కాకినాడ బ్యూరో, 05 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పేడ, వ్యవసాయ, వంటశాల (కిచెన్) వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ,వ్యర్థాల నుంచి సంపద సృష్టించే దిశగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొ రేషన్ ద్వారా జిల్లాలో నాలుగు ప్రత్యేక బయో గ్యాస్ ప్రాజెక్టు లను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, మున్సిపల్, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో ఈ ప్రతిపాదిత ప్రాజెక్టులపై సాధ్యసాద్యాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం మరియు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పేరుకు పోకుండా నివారించడం ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ దశ లక్ష్యాలకు ఈ ప్రాజెక్టులు ఎంతో మద్దతు ఇస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే బయో గ్యాస్, గోబర్ గ్యాస్ పునరుత్పాదక శక్తిగా మారి, గ్రామీణ కుటుంబాలకు వంట అవసరాలకు మరియు ఇతర అవసరాలకు తక్కువ ధరకే లభిస్తుందన్నారు. ప్రతిపాదిత నాలుగు ప్రాజెక్టుల్లో భాగంగా స్థానిక జేఎన్టీయూ పరి ధిలో తగిన స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. పిఠాపురం పాదగయ వద్ద మున్సిపాలిటీ వ్యర్థాలను అనుసంధానం(టైఅప్) చేసుకుని యూనిట్లను నిర్వ హించేందుకు చర్యలు చేపడతామన్నారు. అన్నవరంలో కొండ కిందిభాగంలో ఉన్న పశువులశాల నుంచి పేడను సేకరించి, కిచెన్ వ్యర్థాలు మరియు వ్యర్థ అరటి ఆకులతో యూనిట్ ఏర్పా టు చేసి సేంద్రీయ ఎరువు తయారీతో పాటు పవర్ జనరేషన్‌కు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.??రైతులు తమ వద్ద ఉన్న పశువుల వ్యర్థాలను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. గోబర్ధన్ పథకం ద్వారా బయోగ్యాస్ ప్లాంట్ల నుంచి తయారయ్యే అత్యంత నాణ్యమైన ప్రాకృతిక సేంద్రీయ ఎరువు భూసారాన్ని రక్షించడంతో పాటు,రసాయన ఎరువుల పై రైతుల ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గిస్తుందన్నారు. అంతేకాకుండా, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, కాలుష్య నివారణకు ఈ విధానం ఎంతగానో దోహద పడు తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మనోజ్ కుమార్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఇ. మహమ్మద్ అబ్దుల్ మతిన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందడమే ప్రధాన ధ్యేయం

### త్వరలోనే ఓపీ రద్దీ, ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం
### జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్





**కాకినాడ బ్యూరో, 05 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి :** కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో (జీజీహెచ్) ఓపీ కౌంటర్ల వద్ద సాధారణంకంటే ఎక్కువసమయం పడుతుందనే ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం జిల్లాకలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జీజీహెచ్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జీజీహెచ్ వైద్య అధికారుల తో కలిసి జిల్లా కలెక్టర్ ఆసుపత్రి లోని యూరాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ఓపీల్యాబ్, ఎక్స్-రే మిషన్, డ్రగ్స్ స్టోరేజ్, ఫార్మసీ డిస్పెన్సరీ, ఆర్థో ఓపీ, సర్జరీ ఓపీలలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను నేరుగా పరిశీలించి, అధికారులను వివరాలు అడిగితెలుసు కున్నారు. వివిధ వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ నేరుగా మాట్లాడి అందుతున్న సేవలు, వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందడమే ప్రధాన ధ్యేయంగా పని చేయడం జరుగుతుందని తెలిపారు. జీజీహెచ్ కు సంబంధించి సర్జికల్ ఓపీ, ఆర్థో ఓపీ, జనరల్ మెడిసిన్ ఓపీ విభాగాలలో ఎక్కువగా రద్దీ ఉన్నట్లు గుర్తించామన్నారు.ఇక్కడ ప్రధానంగా రెండు సమస్యలు ఉన్నట్లు గుర్తించామని,ఒకటి ఉన్న స్థలం ఇరుకుగా ఉండటం, రెండవది పేషెంట్స్ ఉదయం సమయంలోనే ఎక్కువ రావడం అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ రెండు అంశాల వల్ల ఎక్కువ సమయంతో పాటు రద్దీ సమస్య ఏర్పడుతోందని, దీన్ని సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రధానం గా సాఫ్ట్‌వేర్ లో సర్వర్ సమస్యల వల్ల కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించా మని వాటిని రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. మందుల పంపిణీకి సంబంధించి తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ, సర్వర్ ఇష్యూ వల్ల ఆలస్యం జరుగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఆ సర్వర్ సమస్యను వెంటనే పరిష్కరించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మందుల సరఫరా చేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు.అలాగే ఓపీ ఫార్మసీ దగ్గర అవసరమైన కంప్యూటర్లు త్వరలోనే కొనుగోలు చేసి అందు బాటులోకి తీసుకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. జీజీహెచ్ లో సమస్యలకు శాశ్వత పరిష్కారానికి గౌరవ ఆరోగ్య శాఖ మంత్రి వర్యుల సహకారంతో కొత్త ఓపీ బ్లాక్ శాంక్షన్ అయిందని, దానికి సంబంధించిన ప్రతిపాదన లు తయారు చేసి రాష్ట్ర స్థాయికి పంపామని, త్వరలోనే టెండర్లు ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. వచ్చే నెలలోనే దీనికి శంఖుస్థాపన కార్యక్రమం కూడాచేపట్టనున్నట్లు కలక్టర్ వెల్లడించారు. తాత్కాలికంగా సమస్యను పరిష్కరిం చడానికి అదనపు సీటింగ్ ఏరియాతో పాటు సక్రమమైన టోకెన్ విధానాన్ని పాటించాలని జీజీహెచ్ వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రాబోయే కొన్ని వారాల్లో ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మందుల సరఫరా, సజావుగా ఓపీ సేవలు జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డా. శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, సీఎస్ఆర్ఎంఓ డా. మెహర్, నర్సింగ్ అధికారులు, ఇతర జీజీహెచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలవట్లు వెంటనే నిర్మించాలి



### జై భీమ్ రావు భారత్ పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ మర్రి పృథ్వీరాజ్ డిమాండ్

**జగ్గంపేట, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం రాజుపాలెం టు రామవరం ఆర్ఎన్‌బిరోడ్డు వేస్తున్న తరుణంలో రామవరం గ్రామానికి చెందిన దళితవాడ దగ్గర కలవట్లు నిర్మించాలని జై భీమ్రా భారత్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ మర్రి పృధ్వీరాజు కోరడం జరిగింది. గతంలో వేసిన తురాలు బలమైన హెవీ లారీలు తిరగడం వల్లతురలు పగిలిపోయి కూడుకుపోయి దళితవాడ అంతా కూడా గతంలో కురిసిన వరదలకు మునిగిపోవడం జరిగింది. ఇప్పుడు వేస్తున్న రోడ్డు తరుణంలో బలమైన కలవడం నిర్మించాలని కోరడం జరిగింది. గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన రోడ్డు వేసేటప్పుడు కలవట్ను నిర్మిస్తానని చెప్పి ఇప్పుడు మరల అదే పాత స్థితిని అనగా తూరలు వేయడం సరికాదని సంబంధిత అధికారులు స్పందించి దళితపేటకు ముంపుకు గురవకుండా బలమైనటు వంటి కలవట్లు నిర్మించాలని, జై భీమ్ రావు భారత్ పార్టీ తరపున మర్రి పృధ్వీరాజు కోరడం జరిగింది.

## తల్లి పాలు వలన రోగాలు మటు మాయం : వైద్యాధికారి డా. దీపిక



**కొత్తవలస, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వియ్యంపేట ఐ.సి.డి.ఎస్ పరిధిలో తుమ్మికాపల్లి, ముసిరాం, దేవాడ, రామలింగాపురం, గొల్లలపాలెం, ఉత్తరాపల్లి, నిమ్మలపాలెంలో తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. తల్లి పాలు వలన రోగాలు మటు మాయం వైద్యాధికారి డా.దీపిక వియ్యంపేట ఐ.సి.డి.ఎస్ పరిధి లో తుమ్మికాపల్లి లో గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు తల్లి పాలు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించినట్లు హెల్త్ అసి స్టెంట్ సత్యారావు తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ తల్లి పాలు వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందని, వ్యాధులు దరి చేరవు అని తెలిపారు. పుట్టిన గంటలోపు బిడ్డకితల్లి పాలు త్రాగిం చాలని, మొదటి ఆరునెలలు తల్లి పాలు మాత్రమే తాగిం చాలని, తెలిపారు. తల్లి పాలు వలన రోగ నిరోధక శక్తి వస్తుందని, తల్లి పాలు వలన ఐ.క్యూ. పెరుగుతుందని,అలర్జీలురావని,శ్వాసకోశ వ్యాధులు, డైయే రియా వంటి వ్యాధులు రావని తెలిపారు. తల్లి పాలు వలన తల్లి బిడ్డా మధ్య ప్రేమానురాగం, అనుబంధం ఏర్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.వి.పద్మావతి, ఎమ్.ఎల్.హెచ్.పి.లు కామేశ్వరి, ధనలక్ష్మి, పావని, జ్యోతి, ఏ.ఎన్.ఎమ్స బేగం, సత్యవతి, సుధా, సుగుణ, గౌరీ, అంగన్వాడీ వర్కర్స్ అంగన్వాడీ వర్కర్స్ సుబ్బలక్ష్మి, శ్యామల రామలక్ష్మి, జ్యోతి కుమారి పాల్గొన్నారు.

## గ్రామీణులకు రక్షిత జలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం




ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ బ్యూరో, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని పండూరు వద్ద కొనసాగుతున్న తాగు నీటి పథకం వాటర్ స్కీమ్ పనులను స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ రూ. 1.40 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రూరల్ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు పూర్తి స్థాయి నిబద్ధతతో పనిచేస్తున్నాం. ప్రజలకు మంచినీటి కొరత రాకుండా చూడటమే మా ప్రాధాన్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి : మాజీ జడ్పీటీసీ నులుకుర్తి






**కాకినాడ బ్యూరో, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** రాష్ట్ర అభివృద్ధి, పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పూతరేకుల తయారీకి ప్రత్యేక గుర్తింపు పొందిన కొవ్వాడ గ్రామంలో టీడీపీ కాకినాడ రూరల్ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావుతో కలిసి నులుకుర్తి, కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు పేదలందరికీ సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఎంతో కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్ లు సరిదే నాగ హరినాథ్, కొమరిశెట్టి నరసింగరావు, మద్దూరి స్వామి, జయేంద్ర బాబు, మాసుమేను గంగయ్య, కాళా సత్తిబాబు, పెంకే గోవిందు, పాలిక ఉషా రాణి, పలివెల గాయత్రి, గ్రామ కమిటీ అధ్యక్షులు కమ్మ శ్రీనివాస రావు, పట్టేం వెంకటేష్, మరేళ్ల రామకృష్ణ, పండూరు జయకృష్ణ, రాందేవ్ సీతయ్య దొర, దొమ్మేటి వెంకటరమణ, కొండా వినాయక్, ఎలగా లోవరాజు, గుబ్బల ప్రసాద్ రావు, జామి సత్తిరాజు, స్థానిక కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా హృదయ విజేత గళ్ళా మాధవి : ఆళ్ళ హరి

**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యురాలిగా ఎన్నికైనప్పటి నుంచి ప్రతీ క్షణం నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న గళ్ళా మాధవి ప్రజా హృదయ విజేతగా నిలిచారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆశీస్సులతో ప్రజల ఆశీర్వాదములతో అతి తక్కువ సమయంలో గళ్ళా మాధవి శక్తీవంతమైన మహిళా నాయకురాలిగా ఎదిగారని కొనియాడారు. గళ్ళా మాధవి పుట్టినరోజు ముందస్తు వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీనివాసరావుతోటలో మొక్కలు నాటారు. దేవతా వృక్షాలైన తులసి, వేప, రాగి వంటి మొక్కలను విద్యార్థులతో నాటించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా యాభై వేల మెజారిటీతో విజయం సాధించి గళ్ళా మాధవి రికార్డ్ సృష్టించారన్నారు. కూటమి అభ్యర్థిగా తనపై



ఇంత నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచుకున్న ప్రజల కోసం అహరహం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. పశ్చిమ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టే సమయానికి నియోజకవర్గం అభివృద్ధిలోనూ, మౌలిక సదుపాయాల్లోనూ అట్టడుగున ఉందన్నారు. అడుగడుగునా గోతులతో నిండిన రహదారులతో, క్షీణించిన పారిశుధ్యంతో అధ్వాన్నంగా ఉన్న నియోజకవర్గాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహాయ సహకారాలతో రెండేళ్ళలోనే అభివృద్ధి పథంలో నిలిపారని హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రజలకు, కార్యకర్తలకు, ప్రత్యేకించి మహిళలకు ప్రత్యేక గ్రీవెన్స్‌లు పెట్టి అండగా నిలిచి కొండంత ధైర్యానిస్తున్నారన్నారు. రాజకీయ ఉద్ధండులకు నిలయమైన గుంటూరు జిల్లాలో తనదైన ఒక ముద్ర వేసుకున్న గళ్ళా మాధవి భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ఆళ్ళ హరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, బిజెపి సీనియర్ నాయకులు అప్పిశెట్టి రంగా, జనసేన నగర కార్యదర్శి షేక్ మెహబుబ్ భాష, నాజర్‌వలి, నండూరి స్వామి, అలా కాసులు, టీడీపీ నాయకులు సలువాది మనోజ్ తదితరులు పేర్కొన్నారు.

# విజయాస్ కోస్టల్ కేర్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి కార్డియాలజీ సేవలు

### శ్రీ సాయి హాస్పిటల్‌లో అరుదైన గుండె శస్త్రచికిత్స విజయవంతం

**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు నగర ప్రజలకు మెరుగైన, అత్యంత అధునాతన కార్డియాక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు 'విజయాస్ కోస్టల్ కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్' వైద్య నిపుణులు డాక్టర్ యోగి వెల్లడించారు. అరండల్‌పేటలోని శ్రీసాయిహాస్పిటల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ గ్రూప్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత విభాగంలో పూర్తిస్థాయి అత్యవసర, శస్త్రచికిత్స సేవలను శ్రీ సాయి హాస్పిటల్‌లో ప్రారంభించినట్లు తెలియజేశారు.

**31 ఏళ్ల యువకుడికి పునర్జన్మ :** డాక్టర్ యోగి మాట్లాడుతూ పుట్టుకతోనే గుండెలోరంధ్రం ఉన్న ఒక 31సంవత్సరాల పేషెంట్ ఇటీవల తీవ్ర అస్వస్థతతో శ్రీ సాయి హాస్పిటల్‌కు వచ్చినట్లు తెలి




పారు. గుండెలో రంధ్రం కారణంగా సదరు పేషెంట్ దైనందిన జీవితంలో తీవ్ర అవస్థలు పడ్డాడని, చిన్నపాటి పని చేసినా విపరీతమైన ఆయాసంతో ఇబ్బంది పడేవాడని పేర్కొన్నారు. కేసు తీవ్రతను పరిశీలించిన విజయాస్ కోస్టల్ కేర్ క్రిటికల్ కేర్, కార్డియాలజీ వైద్యుల బృందం అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను సవాలుగా తీసుకుని విజయవంతంగా పూర్తి చేసిందని హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక వైద్యసాంకేతిక పరిజ్ఞానం, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ కారణంగా శస్త్రచికిత్స పూర్తయిన రెండో రోజే సదరు పేషెంట్‌ను నడిపించగలిగామని తెలిపారు. ప్రస్తుతం బాధితుడు పూర్తి ఆరోగ్యంతో ఉన్నాడని వెల్లడించారు.

**అన్ని విభాగాల్లో అధునాతన వైద్యం :** విజయాస్ కోస్టల్ కేర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఈవో గోవర్ధన రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయస్థాయిలో ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందుబాటు ధరల్లో అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్డియాలజీ విభాగంతో పాటు అన్ని రకాల దీర్ఘకాలిక, తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు తమ హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన నిపుణులచే సమగ్ర చికిత్సలు అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గుడిపాటి ప్రభాకర్ శివ, డాక్టర్ అభిలాష్, డాక్టర్ నజీర్, డాక్టర్ హేమాంజలి, డాక్టర్ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ ఆధ్వర్యంలో గుంటూరులో TOLIC సమావేశం

**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ ఐ.ఆర్.ఎస్ అధికారి అరుణ్ రిచర్డ్ సారథ్యంలో 'టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ' (TOLIC), హిందీ సమావేశం బుధవారం గుంటూరు కన్నవారితోట జీఎస్టీ భవన్ లో జరిగింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల దైనందిన కార్యకలాపాలలో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడం మరియు అధికారులలో హిందీపై పని పరిజ్ఞానాన్ని పెంపొందించడం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు లో పనిచేస్తున్న వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన అధికారులు మరియు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత ప్రభుత్వ అధికార భాషా విధానం అమలు, అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు, పరిపాలనాపరమైన పనులు, నోటింగ్ మరియు డ్రాఫ్టింగ్ (ఫైల్స్ తయారీ)లో హిందీ వినియోగాన్ని పెంచడం, అలాగే అధికారిక హిందీలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకునే ఆచరణాత్మక పద్ధతులపై సమావేశం చర్చించింది. తోలుత గుంటూరు సెంట్రల్ జీఎస్టీ ఇన్స్పెక్టర్ సునీల్ చౌదరి, అధికార భాషా చట్టం నిబంధనలు, అధికార భాషా నియమాలు మరియు అధికార భాషా విభాగం జారీ చేసిన వార్షిక కార్యక్రమంపై సమాచారయుతమైన సెషన్లను నిర్వహించారు. కార్యా



లయ పనిలో హిందీ వినియోగంపై ఆచరణాత్మక ప్రదర్శనలు, పరస్పర చర్చలు జరిగాయి. దీనిలో పాల్గొన్నవారు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు అధికార భాషా అమలుపై తమ అవగాహనను బలోపేతం చేసుకునే అవకాశం కలిగింది. అధికారిక వృత్తి లో హిందీ వినియోగం అనేది కేవలం అధికార భాషకు సంబంధించిన రాజ్యాంగ మరియు చట్టపరమైన నిబంధనలను నెరవేర్చడమే కాకుండా, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడానికి మరియు ప్రజలకు మరింత విస్తృతంగా చేరువ కావడానికి కూడా దోహదపడుతుందని గుంటూరు సెంట్రల్ జీఎస్టీ



జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ రజ్వాని (ఐఆర్ఎస్) తెలిపారు. ఈ కార్యశాలను విజయవంతం చేయడంలో సంపూర్ణ సహకారం అందించినందుకు, పాల్గొన్న కేంద్రకార్యాలయాల అధికారులకు సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ హెయర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ అధికారులు రవీంద్రనాథ్, అశుతోష్, అమృత రాజ్, శశి దాస్, ఆనందగోపాల్, చంద్రవర్మ, నీరజ్, రవి, శ్యాం ప్రకాష్, అమిత్, చక్రధర్, రాజేష్, ప్రణీత, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# హిందూ దేవతలు మరియు ధర్మంపై అసభ్య వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### డీజీపీ (సైబర్ సెక్యూరిటీ) కి బీజేపీ నాయకుల ఫిర్యాదు

**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుల బృందం, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస రాజు, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు సునీల్ రెడ్డి, షేక్ బాజీ తదితర నాయకులతో కలిసి బుధవారం ఆంధ్రప్రదేశ్ డీజీపీ (సైబర్ సెక్యూరిటీ) రవిశంకర్ అయ్యనార్, ఐపీఎస్ ని కలిసి, సోషల్ మీడియా వేదికగా హిందూ దేవతలు, హిందూ ధర్మం, హిందూ సంప్రదాయాలపై అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఇటీవలి కాలంలో కొందరు వ్యక్తులు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవాలను, పవిత్ర సంప్రదాయాలను అత్యంత నీచమైన భాషలో అవమానిస్తూ సమాజంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరం. ఇటువంటి చర్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. అదేవిధంగా, గతంలో నటుడు ప్రకాష్ రాజ్ శ్రీరాముడిపై చేసిన అవమానకర వ్యాఖ్యలను కూడా నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను మత విశ్వాసాలను కించపరచడానికి లేదా కోట్లాది



మంది ప్రజల మనోభావాలను దెబ్బతీయడానికి వినియోగించే హక్కు ఎవరికీ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి హిందూ దేవతలపై, హిందూ ధర్మంపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించరని స్పష్టంగా హెచ్చరిస్తున్నాను. వ్యక్తిగత ప్రచారం కోసం లేదా చౌకబారు గుర్తింపు కోసం హిందూ దేవతలను అవమానించడం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకారయోగ్యం కాదు. సోషల్ మీడియాలో హిందూ ధర్మంపై నిరంతరం ద్వేష ప్రచారం చేస్తున్న వ్యక్తుల వెనుక ఉన్న నిధుల మూలాలు, వారికి ఆర్థిక సహాయం చేస్తున్న శక్తులు, విదేశీ నిధులు లేదా ఇతర అనుమానాస్పద వనరులు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డీజీపీ (సైబర్ సెక్యూరిటీ) గారిని కోరాము. అలాంటి ఖాతాలను గుర్తించి బ్లాక్ చేయడంతో పాటు



బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాము. మా ఫిర్యాదును డీజీపీ (సైబర్ సెక్యూరిటీ) శ్రీ రవిశంకర్ అయ్యనార్ గారు స్వీకరించి, రాష్ట్రంలో ఉన్నా లేదా రాష్ట్రం వెలుపల ఉన్నా చట్ట పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ గుర్తించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దేశంలో ప్రతి మతాన్ని గౌరవించడం భారతీయ సంస్కృతి. అదే సమయంలో ఏ మతాన్నైనా, ముఖ్యంగా హిందూ దేవతలను, హిందూ ధర్మాన్ని లక్ష్యంగా చేసుకుని ద్వేషాన్ని రెచ్చగొట్టే వారిని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరు. అలాంటి వారి విషయంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ తరపున మరోసారి డిమాండ్ చేశారు.

# మధ్యవర్తిత్వం రాజీమార్గం పై అవగాహన కార్యక్రమం

**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాను సారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్ రెడ్డి సూచనలతో బుధవారం పల్నాడు జిల్లా అమరావతిలో మధ్యవర్తిత్వం రాజీమార్గం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు మధ్యవర్తిత్వం (Mediation) ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ, సివిల్ తగాదాలు, బ్యాంకు రుణాలకు సంబంధించిన కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రెవెన్యూ వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరిం



చుకోవచ్చని తెలిపారు. సత్తెనపల్లి కోర్టు పరిధిలోని కక్షిదారులు కోర్టు పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్తెనపల్లి బస్టాండ్ సమీపంలోని మార్కెట్ యార్డ్ నందుగల కోర్టు నందు గల కోర్టు సిబ్బందిని సంప్రదించి, మధ్యవర్తిత్వ సేవలను వినియోగించుకుని తమ వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్ అట్లూరిజ్యోతి పాల్గొని మధ్యవర్తిత్వ విధానం, ఉచిత న్యాయ సేవలు, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రామం లోకి కొత్త వ్యక్తి వస్తే పూర్తి సమాచారం తెసుకోవాలి




**కొత్తవలస, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం లో గల గ్రామస్తులు వారి యొక్క అవసరాలనిమిత్తం ఇతరులను ఎవరినైనా వాచ్మెన్‌గా గానీ, పని మనుషులుగా గాని, మరి ఏ ఇతర పనుల నిమిత్తం నియమించుకోవాలన్నా, ఇళ్లను అద్దెకు ఇవ్వాలన్న వారి యొక్క పూర్తి పేరు చిరునామా, ఆధార్, పాన్ కార్డు తీసుకొని వెరిఫై చేయాలని పోలీసులు కోరారు. కొత్తవలస మండలంలో ఎటువంటి క్రైమ్ జరుగకుండా ప్రజల సంక్షేమ దృశ్య వారి నియామకం నిమిత్తంనకు ముందుగానే వారి నేర చరిత్ర ఏమైనా ఉంటే తెలుసుకోవడానికి పోలీస్ స్టేషన్ కి వచ్చి తెలియజేస్తే పోలీసులు ప్రజలకు పూర్తి సహకారం అందించగలరని అన్నారు.

# ఆగష్టు 10న క్విట్ కార్పొరేట్ ఇండియా నిరసన కార్యక్రమం

### రైతు సంఘాలు ,కార్మిక సంఘాలు పిలుపు




**గుంటూరు, 05 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి :** బుధవారం బ్రాడీపేట లోని పిఎల్ రావు భవన్లో రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉల్లిగడ్డ నాగేశ్వరావు అధ్యక్షతన జరిగినది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, సిఐటియు జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు కూలీ సంఘం నాయకులు గనిరాజు, ఏరువాక రైతు కూలీ సంఘం నాయకులు రవి, కౌలు రైతు సంఘం నాయకులు కే .విట్టల్ రెడ్డి, సిఐటియు నాయకులు కె. నళీనీకాంత్, కె.శ్రీనివాసరావు, బి. ముత్యాలరావు, మరియదాసు, కె.నాగేశ్వరావు, రైతు సంఘ నాయకులు వల్లూరు భారతి, ఇమ్మడి రామారావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి సంపదలు సృష్టించే కార్మిక, కర్షకులకు శ్రమ తగ్గ ఫలితం రావట్లేదు అన్నారు. దీని ఫలితంగా కార్మికులు అరకొర జీతాలతో జీవనం కొనసాగిస్తుంటే మరొకవైపు దేశానికి అన్నం సాగు రైతు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి కేంద్ర ప్రభుత్వం తో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్ ల పేరుతోటి ఎన్నో సంవత్సరాల నుంచి ఉద్యమాలు చేసి సాధించుకున్న హక్కులను హరిస్తూ కొత్త చట్టాలు తీసుకురావడం, రేయనక,పగలనక కాయ కష్టం చేసి పంటలు పండించి దేశ ప్రజలకు ఆహారాన్ని అందించే రైతుకు మద్దతు ధర లేక విలువల్లాడి పోతున్న పరిస్థితి దాపురించాయన్నారు. ఆనాడు బ్రిటిష్ పాలకులు ఏ విధంగా దేశ ప్రజలను నియంతృత్వంతో పరిపాలన చేశారు అదే పద్ధతిలో నేడున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా నియంత్రత్వ ధోరణి అవలంబిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా రకరకాల ఉద్యమాలు బయలుదేరాయన్నారు. విద్యార్థి, యువత, రైతు, కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున రకరకాల రూపంలో ఉద్యమాల బాటలో పట్టారన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంతో స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ఆవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 10వ తేదీన క్యిట్ కార్పొరేట్ ఇండియా పేరుతో దేశంలో వనరులన్నీ కూడా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పటాన్ని వ్యతిరేకించాలని ఈ సమావేశ తీర్మానించడం జరిగింది. ఈనెల 10వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం మరియు జిల్లాలోని తాడేపల్లి సెంటర్లో కూడా నిరసన కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మానించడం జరిగింది.

6

# సోషల్ మీడియాలో చురుగ్గా ఉండండి

8 సెకన్ల లోపే నిద్రలోకి జారుకుంటా!
రోజుకు మూడున్నర గంటలు మాత్రమే నిద్రపోతా
క్రమం తప్పకుండా యోగా చేస్తా
ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించండి
ఢిల్లీ రాజకీయాల వలలో చిక్కుకోవద్దు
లెటర్ హెడ్ వాడకంలో జాగ్రత్త
మీడియాతో మాట్లాడేటప్పుడు బీ కేర్ఫుల్
బీజేపీ కొత్త రాజ్యసభసభ్యులకు ప్రధాని మోడీ హితవు



**న్యూఢిల్లీ:** నిద్రకు ఉపక్రమించిన 8 సెకన్లలోపే తనకు నిద్ర పట్టేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. బుధవారం న్యూఢిల్లీలోని తమ నివాసంలో బీజేపీకి చెందిన సుమారు 37 మంది కొత్తగా ఎన్నికైన, ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన రాజ్యసభ సభ్యులతో అల్పాహార సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ స ఈ సమావేశం లో ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఇటీవల చేరిన నాయకులు కూడా పాల్గొన్నారు. ప్రధానమంత్రి ఈ సమావేశంలో రాజకీయ తత్వం, సభా నైతికత, వ్యక్తిగత ప్రవర్తన గురించి వారికి మార్గనిర్దేశం చేశారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం ఈ సమావేశం అత్యంత సుహృద్భావ వాతావరణంలో జరిగింది. తాను రోజుకు కేవలం మూడున్నర గంటలు మాత్రమే నిద్రపోతానని, కానీ ప్రతిరోజూ యోగా చేస్తానని, అది పని సామర్థ్యాన్ని పెంచుతుందని ప్రధాని తెలిపారు. సభ్యులు క నాడా ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించాలని ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు. ఢిల్లీ రాజకీయ వలయంలో చిక్కుకోవద్దని హెచ్చరించారు. ఢిల్లీలో ఎవరితో కలుస్తున్నారో ఎవరితో కూర్చుంటున్నారో జాగ్రత్తగా చూసుకోవాలని సూచిం చారు. లెటర్హెడ్ వాడకం, మరియు స్వీయ ప్రవర్తనపై చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సామాజిక మాధ్య మాలు, టీవీ చానెళ్లలో కూడా అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రధానమంత్రి సలహాఇచ్చారు. ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో చురుకు గా ఉండాలని, యువతతో మమేకం కావాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని, యువతను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సలహా ఇచ్చారు. ప్రధానమంత్రి కార్యనిర్వహణ విధానం గురించి సభ్యులు అడిగినప్పుడు తాను ప్రస్తుత కాలంలోనే ఉంటానని మోడీ సమాధానమిచ్చారు. ప్రస్తుతం మీతో మాట్లాడుతున్నాను కాబట్టి ఇక్కడే ఉన్నాను ఇంకేమీ ఆలోచించడం లేదని అన్నారు. ప్రస్తుతంలోనే ఉండి దేశం మెరుగైన భవిష్యత్తు కోసం పని చేయాలని సలహాఇచ్చారు

# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు
కంటెంట్ల బూస్ట్కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన

వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్స్టాగ్రామ్లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# తమిళనాట తొలి బడ్జెట్ ప్రవేశ పెట్టిన విజయ్ ప్రభుత్వం

'అన్నన్ సీర్ తిట్టమ్'నకు బడ్జెట్లో రూ.812 కోట్లు కేటాయింపు
పథకం కింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీర



**చెన్నై:** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించింది. ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టమ్'ను టీవీకే ప్రభుత్వం తాజా బడ్జెట్లో ప్రకటించింది. దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు కేటాయించారు. 2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అంద నుంది. వెట్రీథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యా భివృద్ధి శిక్షణ పొందనున్నారు. రూ.2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్టాప్స్ అందించేందుకు వెట్రీ ల్యాప్టాప్ స్కీమ్ను బ్జడెట్లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు కేటాయించారు. 'పుతియా పయనం-పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదివే 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, వాటిల్ బాటిళ్లు ఇవ్వనున్నారు. కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ప్రతినెలా రూ.2,500, ఏడాదికి ఉచితంగా 6 వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం వంటి హామీలపై మాత్రం బడ్జెట్లో ప్రకటన రాలేదు.

# అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు : ఉదయనిధి



**చెన్నై:** సినీ నటి త్రిషా కృష్ణన్పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేరే చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్లో రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్పై ఉధయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి. లాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉధయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు
మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపణలు

**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత నిరసనలు తెలిపారు. అయితే, విద్యార్థుల్ని బలప్రయోగం, బెదిరింపులతో కేంద్రం అణచివేసిందని లోక్సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులు రాజ్యాంగ పరిరక్షకులని, కుప్పకూలుతున్న పనికిరాని విద్యా వ్యవస్థను ప్రశ్నిచడంలో ఎలాంటి తప్పు లేదని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారి ఇళ్లకు గుండాలను పంపించారని, ఆ తర్వాత 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలు అంగీకరించారని, ఇది పూర్తిగా అర్థరహితం, దీనిని తాము అంగీకరించమని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని ఆరోపించారు. దేశంలో పారదర్శకంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, వారిపై లాఠీచార్జ్ చేయడం, వేధించడం సరికాదని అన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.

# జార్ఖండ్ నిరుద్యోగులకు సీజేపి మద్దతు

సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

**ముంబై:** జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# జాతీయ రహదారులపై తగ్గిన ప్రమాదాలు

దాదాపు 4 శాతం తగ్గిందన్న కేంద్రమంత్రి గడ్కరీ

**న్యూఢిల్లీ:** జాతీయ రహదారులపై ప్రమాదాల తగ్గినట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత నేషనల్ హైవేలపై మరణాల సంఖ్య దాదాపు 4 శాతం తగ్గిందని బుధవారం పార్లమెంటులో వెల్లడించారు. హైవేలపై యాక్సిడెంట్స్ లలో చనిపోయే వారి సంఖ్య 2025లో 62 వేల 122 కు తగ్గినట్లు చెప్పారు. 2024లో 64 వేల 772 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే.. 2023లో 63 వేల 112 మంది చనిపోయినట్లు తెలిపారు. ప్రతి ఏటా మరణాల సంఖ్య పెరుగుతూ వస్తుండేదని.. కానీ కరోనా తర్వాత తొలిసారి 2025లో మృతుల సంఖ్య తగ్గినట్లు చెప్పారు. అదే సమయంలో 2025లో రోడ్డు యాక్సిడెంట్ల సంఖ్య 5.30 శాతం పెరిగినట్లు చెప్పారు. అంటే 5.13 లక్షల యాక్సిడెంట్స్ జరిగినట్లు చెప్పారు. సరాసరిగా గంటకు 21 మంది చనిపోయినట్లు వెల్లడించారు. నేషనల్ హైవేస్ పై 2025లో లక్షా 43 వేల 526 ప్రమాదాలు జపగగా.. ఈ ఏడాది జులై 27 వరకు 77 వేల 234 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తమిళనాడులో ఎక్కువగా జరుగుతున్నట్లు గడ్కరీ చెప్పారు. 71 వేల 387 యాక్సిడెంట్స్ తో తమిళనాడులో ముందంజలో ఉన్నట్లు చెప్పారు. అదేసమయంలో రోడ్డు ప్రమాద మృతులలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 2025లో ఆ రాష్ట్రంలో 27 వేల 550 మంది చనిపోయినట్లు గణాంకాలు పార్లమెంటుకు తెలిపారు.

# కోడలు ఇంట్లో అత్తకు నివసించే హక్కు ఉంది

హిమాచల్ మైకోర్టు సంచలన తీర్పు

**సిమ్లా:** కోడలి ఇంట్లో అత్తగారు కూడా నివసించే హక్కు ఉంటుందని హిమాచల్ప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తన సొంత సంపాదనతో కట్టుకున్న ఇంటిలోంచి వెళ్లిపోవాలని అత్తమామలకు కోడలి ఆదేశించడంతో బాధిత అత్తగారు గృహ హింస కింద కేసు పెట్టింది. విచారణ సందర్భంగా ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి కూడా పూర్తిగా ఉంటుందని న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మండి జిల్లాల్లోని రామ్నగర్కు చెందిన వ్యక్తితో 2013, మే నెలలో వివాహం జరిగింది. 2014 వరకు అత్తమామలతోనే కోడలి నివసించింది. అయితే ఇంతలో వివాదాలు తలెత్తడంతో అత్తమామలను ఇంట్లో నుంచి గెంటేసింది. 2025, నవంబర్ 7న ఇంట్లో నుంచి పంపేసి అ÷-దదెకు ఇచ్చేసింది. దీంతో అత్తగారు గృహ హింస కేసు పెట్టింది. అయితే తన సొంత సంపాదనతో నిర్మించుకున్న ఇల్లు అని దిగువ కోర్టులో కోడలు పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్ను న్యాయమూర్తి రాకేష్ కాంతాలా విచారించి కొట్టేశారు. ఉమ్మడి ఇంట్లో అత్తగారికి హక్కు ఉంటుందని తెలిపింది. అయితే కోడలిపై అత్తగారు పెట్టిన గృహ హింస కేసు తాజాగా హైకోర్టులో విచారణ రాగా.. కోడలి ఇంట్లో అత్తగారికి నివసించే హక్కు ఉంటుందని.. ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించింది. ఇరుపక్షాలు కలిసి నివసించినప్పుడు అందరికీ హక్కులు ఉంటాయని తెలిపింది. అత్తమామలు బయటకు పంపేసి ఇవ్వడం ఏ మాత్రం సరైందని కాదని పేర్కొంది. గృహ సంబంధంలో నివసిస్తున్న ప్రతి మహిళకు, ఆమె కుమార్తె, సోదరి, భార్య, కోడలు, అత్త అయినా సరే.. ఉమ్మడి గృహంలో నివసించే చట్టపరమైన హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఇల్లు కోడలి పేరు మీద ఉన్నప్పటికీ.. అక్కడ నివసించే హక్కు అత్తగారికి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పింది.

# హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

మరోమారు ఇరాన్కు ట్రంప్ ఘాటు హెచ్చరిక

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్ను హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది.

# 2027 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ

## ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు మ్యాచ్‌లు

వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లను ఏ దేశంలో లేదా ఏ వేదికల్లో నిర్వహిస్తారనే దానిపై ఐసీసీ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్‌లో గెలిచిన టాప్ టీమ్ నేరుగా ఈ 14 జట్ల ప్రధాన గ్రూప్‌లో చోటు దక్కించుకుంటుంది. ఇక క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్-12 లోకి అడుగుపెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాల ఉమ్మడి ఆతిథ్యంలో జరగనుంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు కలిసి ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. టోర్నీలోని మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా 8 వేదికలు సౌతాఫ్రికాలోనే ఉన్నాయి. మిగిలిన వాటిలో 3 వేదికలు జింబాబ్వేలో, 1 వేదిక నమీబియాలో ఉన్నాయి. మెయిన్ ప్రపంచకప్ మ్యాచ్‌లు 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్నాయి. క్వాలిఫైయర్ రౌండ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి. సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో చివరన ఉండే రెండు ఫుల్ మెంబర్ జట్లు (ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలు మినహా) ఈ క్వాలిఫైయర్‌లో ఆడాల్సి ఉంటుంది. వీరితో పాటు సిడబ్ల్యూసి లీగ్ 2లో టాప్-4 లో నిలిచిన జట్లు, అలాగే వరల్డ్ కప్ క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్?లో టాప్-4 లో నిలిచిన జట్లు కలసి మొత్తం 10 జట్లు ఈ క్వాలిఫైయర్స్‌లో తలపడతాయి. త 2023 వన్డే ప్రపంచకప్‌లో క్వాలిఫైయర్ రౌండ్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన మాజీ ఛాంపియన్ వెస్టిండీస్‌కు మళ్లీ అలాంటి పరిస్థితే ఎదురయ్యేలా కనిపిస్తోంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో విండీస్ 10వ స్థానంలో ఉంది. సెప్టెంబర్ 30 కట్-ఆఫ్ తేదీకి ముందు కరేబియన్ జట్టు కేవలం 2 వన్డేలు మాత్రమే ఆడనుంది (అవి భారత్‌తో జరగనున్నాయి). అటు అఫ్గానిస్థాన్, ఐర్లాండ్ మధ్య జరిగే వన్డే సిరీస్ ఫలితాలు కూడా వెస్టిండీస్ భవిష్యత్తును శాసిస్తాయి. ఐర్లాండ్ 4-1 లేదా 5-0 తో గెలిచి, వెస్టిండీస్ భారత్‌పై రెండు వన్డేల్లోనూ విజయం సాధిస్తేనే కరేబియన్ జట్టు నేరుగా టాప్-8 కి చేరుకునే అవకాశం ఉంటుంది.



## విమర్శలకు సెంచరీతో సమాధానం.. రోహిత్‌పై కైఫ్ కీలక వ్యాఖ్యలు

టీమిండియా స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ భవిష్యత్తుపై కొంతకాలంగా సాగుతున్న చర్చకు మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తనదైన శైలిలో స్వస్తి పలికాడు. 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని రోహిత్ జట్టు నుంచి స్వచ్ఛందంగా తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశాడు. ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో రోహిత్ శర్మ సాధించిన అద్భుత సెంచరీ (138) ఇందుకు నిదర్శనమని కైఫ్ పేర్కొన్నారు. గత కొంతకాలంగా రోహిత్ స్వల్ప స్కోర్లకే పరిమితమవుతుండటంతో, ఆయనను వన్డే జట్టు నుంచి తప్పించాలనే ఆలోచనలో సెలక్షన్ కమిటీ ఉందంటూ జోరుగా ప్రచారం సాగింది. అయితే, ఈ ఊహాగానాలన్నింటినీ రోహిత్ తన అద్భుత ప్రదర్శనతో పటాపంచలు చేశారని కైఫ్ అభిప్రాయపడ్డాడు. "నేను సరిగ్గా ఆడలేకపోతే మీరే నిర్ణయం తీసుకోండి, అవసరమైతే తప్పించండి. కానీ నా అంతట నేనుగా స్వచ్ఛందంగా తప్పుకోను" అనే బలమైన సందేశాన్ని రోహిత్ తన బ్యాటింగ్ ద్వారా చాటిచెప్పారని కైఫ్ విశ్లేషించారు. రాబోయే వన్డే ప్రపంచ కప్‌నే లక్ష్యంగా చేసుకుని రోహిత్ తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాడని, ఈ తరుణంలో అతడిని జట్టు నుంచి తప్పించే పరిస్థితి లేదని కైఫ్ అన్నాడు. ఈ క్లిష్ట సమయంలో జట్టు యాజమాన్యం రోహిత్‌కు బహిరంగంగా మద్దతు తెలపాలని సూచించాడు. "2027 ప్రపంచ కప్ ప్రణాళికల్లో రోహిత్ కీలక భాగం" అని అధికారికంగా ప్రకటించాలని కోరాడు. క్రీడల్లో ఫామ్ హెచ్చుతగ్గులు సహజమని, ఒకటి రెండు సిరీస్‌లలో విఫలమైనంత మాత్రాన ప్రతిభను శంకించకుండా అండగా నిలవాలని కైఫ్ హితవు పలికాడు.



## క్రికెట్ జట్టు యజమానిగా టీమిండియా దిగ్గజం జహీర్ ఖాన్

భారత క్రికెట్ జట్టు మాజీ స్టార్ పేసర్, 2011 ప్రపంచకప్ హీరో జహీర్ ఖాన్ కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. మైదానంలో బౌలర్‌గా రాణించిన జహీర్, ఇప్పుడు వ్యాపారవేత్తగా మారి ఫ్రాంచైజీ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. శ్రీలంకలో జరిగే లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుగాంచిన జాఫ్నా కింగ్స్‌కు సహ యజమానిగాజహీర్ ఖాన్ బాధ్యతలు స్వీకరించాడు. స్వీడన్ కేంద్రంగా పనిచేసే 'యాంకర్ స్పోర్ట్స్ ఏబీ' అనే గ్లోబల్ స్పోర్ట్స్ గ్రూప్, జాఫ్నా ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. ఈ సంస్థ అధినేత నాగేంద్ర సిద్ధాటమ్‌తో కలిసి జహీర్ ఖాన్ భాగస్వామి అయ్యాడు. దీంతో ఫ్రాంచైజీ పేరును 'యాంకర్ జాఫ్నా కింగ్స్'గా మార్చారు. ఈ సంస్థకు ఇప్పటికే యూరోపియన్ టీ20, కెనడా సూపర్ 60 లీగ్స్‌లో కూడా జట్లు ఉన్నాయి. గతంలో జాఫ్నా కింగ్స్ యాజమాన్యంపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు రావడమే ఈ మార్పుకు ప్రధాన కారణం. పాత యాజమాన్య బృందంలోని సహ యజమాని మంజోత్ కల్రాను ఈ కేసులో అరెస్ట్ చేయడంతో శ్రీలంక క్రికెట్ బోర్డు ఆ ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో యాంకర్ స్పోర్ట్స్ సంస్థ కొత్త యాజమాన్య హక్కులను దక్కించుకుంది. ఈ కొత్త బాధ్యతపై జహీర్ ఖాన్ ఆనందం వ్యక్తం చేశాడు. "శ్రీలంక క్రికెట్‌లో ఎంతో ప్రతిభ ఉంది. అక్కడి బౌలింగ్ నైపుణ్యాలంటే నాకు ఎంతో గౌరవం. ఇప్పుడు యజమానిగా ఆ దేశ క్రికెట్‌లో భాగం కావడం ఉత్సాహంగా ఉంది" అని ఆయన అన్నాడు. జహీర్ వంటి దిగ్గజం రాకతో లంక యువ క్రికెటర్లకు గొప్ప మార్గనిర్దేశం లభిస్తుందని ఎల్‌పీఎల్ టోర్నమెంట్ డైరెక్టర్ సమంత దొడన్‌వేల హర్షం వ్యక్తం చేశారు. ఎల్‌పీఎల్ చరిత్రలో జాఫ్నా కింగ్స్ జట్టు ఇప్పటివరకు 5 సీజన్లలో 4 సార్లు ఛాంపియన్‌గా నిలిచి రికార్డు సృష్టించింది.

## అజిత్ అగార్కర్ మార్పు తప్పదా?

### అతడి స్థానంలో మరో మాజీ స్టార్ ప్లేయర్!

భారత క్రికెట్‌లో మరో కీలక మార్పుకు రంగం సిద్ధమవుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. జట్టు ఎంపిక బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ భవితవ్యంపై సందిగ్ధత నెలకొంది. ఆయన స్థానంలో భారత మాజీ స్టార్ వీవీఎస్ లక్ష్మణ్‌ను తీసుకురావాలని బీసీసీఐ పెద్దలు ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. రోహిత్ శర్మ భవిష్యత్తు చుట్టూ జరిగిన పరిణామాలు కూడా ఈ చర్చకు బలం చేకూర్చినట్టు తెలుస్తోంది. బీసీసీఐ ప్రధాన ఎంపిక కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ ఒప్పందం జూన్ 2026తో ముగిసింది. ఆ తర్వాత బోర్డు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఆయన కొనసాగుతారనే ప్రచారం జరుగుతూ వచ్చింది. కానీ, ఇప్పుడు అనూహ్యంగా కొత్త ముఖాన్ని తీసుకురావాలనే ఆలోచన సాగుతున్నట్టు సమాచారం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్ రోహిత్ శర్మకు చివరిదని ముందుగా ప్రచారం జరిగింది. ఆ తర్వాతి సిరీస్‌లకు అతణ్ని పక్కన పెట్టే అంశంపై అగార్కర్ నేతృత్వంలోని ఎంపిక కమిటీ, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు యాజమాన్యంతో చర్చించినట్టు కథనాలు వెలువడ్డాయి. అయితే లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేకు ముందు అదే రోహిత్ చివరి మ్యాచ్ అవుతుందనే వార్త బయటకు వచ్చింది. ఆ మ్యాచ్‌లో రోహిత్ సెంచరీతో మెరవడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఎంపిక కమిటీపై ఒత్తిడి పెరిగినట్టు చెబుతున్నారు. లార్డ్స్ వన్డే తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టమైన ప్రకటన చేశారు. రోహిత్ ఇంకా జట్టు ప్రణాళికల్లో భాగమేనని చెప్పారు. అతడు ఇంకా కొంత కాలం భారత జట్టుకు ఆడతాడని వెల్లడించారు. ఈ ప్రకటనకు ముందు అగార్కర్‌తో సంప్రదింపులు జరగలేదని కూడా వార్తలు వచ్చాయి. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ పది మ్యాచ్‌ల్లో ఎనిమిది ఓటములు చవిచూసింది. ఈ ప్రదర్శనపై సమీక్ష సమావేశం నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సమావేశం జరగాల్సి ఉన్నా ఇప్పటికీ నిర్వహించలేదు. ఇప్పటికే భారత జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లిపోయింది. దీంతో ఆ సమావేశం ఎప్పుడు జరుగుతుందనే ఆసక్తి నెలకొంది.






## ఇంగ్లాండ్ పౌరసత్వం పొందిన పాక్ క్రికెటర్ ఆమిర్.. ఐపీఎల్ 2027లో ఆడటంపై కీలక వ్యాఖ్యలు!

పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అధికారికంగా ఇంగ్లాండ్ పౌరసత్వం (యుకే పౌరసత్వం) పొందడంతో ఆయన ఐపీఎల్ (ఖ్రూ)లో ఆడటంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. బ్రిటిష్ పాస్‌పోర్ట్ రావడంతో ఆమిర్ ఇప్పుడు ఇంగ్లాండ్ దేశవాళీ క్రికెట్‌తో పాటు 'ది హండ్రెడ్' టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ తరఫున లోకల్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాక్ ఆటగాళ్లపై ఐపీఎల్‌లో నిషేధం ఉన్నప్పటికీ... గతంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ బ్రిటిష్ పౌరసత్వం పొంది కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే నిబంధనల ప్రకారం మహమ్మద్ ఆమిర్‌కు కూడా ఇంగ్లాండ్ ప్లేయర్‌గా ఐపీఎల్ వేలంలో పాల్గొనే అర్హత లభించింది. ఈ సందర్భంగా ఆమిర్ స్పందిస్తూ... "2027 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో నేను విదేశీ ప్లేయర్ గా ఆడతాను. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే... నేను అందులో పాల్గొంటానో లేదో ఇప్పటికైతే నాకూ తెలియదు, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఐపీఎల్ పాల్గొనడంపై ఎలాంటి ప్రణాళికలు ఖరారు చేయలేదని, ముందుగా ప్రస్తుతం ఆడుతున్న లీగ్‌లపైనే శ్రద్ధ పెట్టినట్లు తెలిపాడు.







# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.



# విడుదలకు సిద్ధం అవుతున్న కొరియన్ కనకరాజు



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో-కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్. ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది. కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.




# మిస్సింగ్ మేఘన.. ఫస్ట్ లుక్ విడుదల

రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధృవన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గో÷-డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉ ందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శామ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా,

# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న డోరతి మూవీ

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.




# వేధించే వారి అకౌంట్లు ట్యాగ్ చేయండి

డీప్‌ఫేక్ కంటెంట్‌ను దుర్వినియోగం చేయడంపై ఇటీవలే తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్, ఇప్పుడు ఆన్‌లైన్ వేధింపులపై మరో ముందడుగు వేశారు. సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి, వారి వివరాలను బహిర్గతం చేయాలని నెటిజన్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో ఇతరులను వేధించే, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సృష్టించిన లేదా అంగీకారం లేకుండా తీసిన వ్యక్తిగత చిత్రాలను పంచుకునే అకౌంట్ల వివరాలను ట్యాగ్ చేయాలని మృణాల్ కోరారు. "ఇంటర్నెట్‌లోని ఈ మేధావుల కోసం ఓ 'హాల్ ఆఫ్ ఫేమ్' నిర్మిద్దాం. వేధించే ఖాతాలను గుర్తిస్తే, వాటిని ట్యాగ్ చేయండి. ఇలాంటివి డాక్యుమెంట్ చేయడం చాలా అవసరం" అని తన పోస్టులో పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితమే డీప్‌ఫేక్‌పై మృణాల్ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. "నా ఫొటోలను ఉపయోగించి డీప్‌ఫేక్ కంటెంట్ సృష్టించడం లేదా పంచుకోవడం చట్టవిరుద్ధం, ఆమోదయోగ్యం కాదు. దీన్ని అధికారిక హెచ్చరికగా భావించండి. నా గుర్తింపును ఇంకెవరైనా దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు. ఇక మృణాల్ కెరీర్ విషయానికొస్తే, ఆమె చివరిగా డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వచ్చిన 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రంలో వరుణ్ ధావన్, పూజా హెగ్డేలతో కలిసి నటించారు. ప్రస్తుతం ఆమె సౌత్ ఇండియాలో ఓ భారీ ప్రాజెక్టులో భాగమయ్యారు. అట్లీ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, దీపికా పదుకొణె ప్రధాన పాత్రలలో నటిస్తున్న 'రాకా' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా కలిసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. ఇటీవల విడుదలైన 'రాకా' ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ గుండుతో, తోడేలు పంజా ముఖానికి అడ్డుగా ఉన్న ఇంటెన్స్ లుక్‌లో కనిపించి సినిమాపై అంచనాలను పెంచారు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342